ఏటీఎం లేక ఇక్కట్లు


నెన్నెల గ్రామీణ బ్యాంకులో నగదు కోసం బారులుదీరిన ఖాతాదారులు

- నెన్నెల మండలంలో రెండు బ్యాంకులు
- పదివేలకు పైగా ఖాతాదారులు
- నగదు కోసం బెల్లంపల్లికి..
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నెన్నెల: మండలంలో ఏటీఎం సౌకర్యం లేక నగదు కోసం మండలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు వినియోగదారుల కోసం దాదాపు చాలా గ్రామాల్లో ఏటీఎం కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ మండల వాసులకు మాత్రం ఆ భాగ్యం కలగడం లేదు. అకౌంట్ పాస్ పుస్తకం ప్రింటింగ్, స్టేట్‌మెంట్, నగదు జమ తదితర సేవలన్నీ నేడు డిజిటల్ మయంగా మారాయి. కానీ ఇక్కడ కనీసం ఏటీఎంలు కూడా లేకపోవడంతో బ్యాంకుల ఖాతాదారులు తిప్పలు పడుతున్నారు.

మండలంలో..

మండలంలో 19 గ్రామపంచాయతీలు, 34 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో మొత్తం 24 వేల జనాభా ఉంది. ఈ సంఖ్యలో సగానికిపైగా సుమారు 12 వేల మందికి బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. కాగా మండలం మొత్తానికి తెలంగాణ గ్రామీణ బ్యాంకులు రెండు మాత్రమే సేవలు అందిస్తున్నాయి. ఒకటి మండల కేంద్రంలో కాగా మరొకటి ఆవుడంలో ఉంది. ఈ రెండు బ్యాంకులకు సంబంధించి ఒక్క ఏటీఎం కూడా లేదు. రెండే రెండు బ్యాంకులు దిక్కు కావడంతో నగదు తీసుకోవడానికి ప్రజలు నిత్యం కష్టాలు పడాల్సి వస్తుంది. సీఎస్‌సీలకు వద్దకు వెళ్తే వెయ్యి నగదు తీసుకోవడానికి రూ.20 నుంచి రూ.50 వసూలు చేస్తున్నారు. అక్కడ కూడా పెద్ద మొత్తంలో నగదు తీసుకోలేకపోతున్నారు.

20 కిలోమీటర్లు వెళ్లాల్సిందే..

ఖాతాదారులకు ఏటీఎం కార్డులు ఇస్తున్న బ్యాంకులు ఏటీఎం కేంద్రాలను ఏర్పాటు చేయడంలో ఆసక్తి ప్రదర్శించడం లేదు. నగదు తీసుకోవడానికి బ్యాంకులే దిక్కు కావడంతో నిత్యం గంటల కొద్ది బ్యాంకుల్లో బారులు తీరాల్సి వస్తుంది. మిగతా రోజుల్లో బాగానే ఉన్న సెలవు దినాల్లో నగదు కావాలంటే ఇక్కట్లు పడాల్సిందే. దీంతో ఎక్కువగా రైతులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు ధాన్యం డబ్బులను తీసుకోవడానికి సైతం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు రైతుబంధు డబ్బుల కోసం బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు. రాత్రి సమయంలో నగదు కావాలంటే 20 కిలోమీటర్ల దూరం ఉన్న బెల్లంపల్లికి వెళ్లాల్సి వస్తుంది. అధికారులు ఏటీఎం కేంద్రాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఏటీఎం ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో ఏటీఎం లేక వివిధ గ్రామాల నుంచి వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏటీఎం సెంటర్ అందుబాటులో ఉంటే డబ్బు తీసుకునే అవకాశం ఉంటుంది. ఏటీఎం ఏర్పాటు చేయాలి.

– హమీద్ బాబా, నెన్నెల

సమయం వృథా..



బ్యాంకులో నగదు తీసుకోవడానికి వెళ్తే గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి వస్తుంది. దీనికి సమయం వృథా కావడంతో సకాలంలో డబ్బులు తీసుకోలేకపోతున్నాం. డబ్బులు అవసరం ఉంటే బెల్లంపల్లికి వెళ్లాల్సి వస్తుంది.

– బత్తిని వెంకటేష్, చిత్తాపూర్

ఇబ్బంది పడుతున్నాం



బ్యాంకు సెలవు రోజుల్లో నగదు తీసుకోవడం ఇబ్బందిగా ఉంది. రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగితే అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి తీసుకెళ్లడానికి డబ్బులు లేక తిప్పలు తప్పడం లేదు.

– షాకీర్‌పాషా, ఆవుడం

అందరి సహకారంతోనే అభివృద్ధి

- జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి
- ముగిసిన కోటపల్లి మండల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి

కోటపల్లి: మండలంలోని నాయకులు, అధికారులు, ప్రజల సహకారంతోనే ఐదేళ్లలో అభివృద్ధి సాధ్యమైందని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మంత్రి సురేఖా అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె హాజరయ్యారు. మండలంలో జరిగిన పలు అభివృద్ధి పనులను అధికారులు చదివి వన్పించారు. 2014కు ముందు గిరిజనేతరులు సాగు చేసుకుంటూ ఫెన్సింగ్ వేసుకున్న పోడు భూముల్లో అటవీ అధికారులు జోక్యం చేసుకోవద్దని సమావేశంలో తీర్మానించారు. మోడల్ స్కూల్‌లో బాలురకు హాస్టల్ వసతి లేకపోవడంతో ఎస్సీ హాస్టల్‌లో తాత్కాలికంగా వసతి ఏర్పాటు చేయగా విద్యార్థులకు సరిపడా బాత్‌రూమ్స్, టాయిలెట్స్, అదనపు గదులు నిర్మించాలని తీర్మానించారు. కోటపల్లి నుంచి పార్‌పల్లి, లింగన్నపేట వరకు తారు రోడ్డు నిర్మాణానికి 2019లో పనులు ప్రారంభించినా నేటికీ పూర్తి కాలేదు. పనులు పూర్తయ్యేలా చూడాలని ప్రజాప్రతినిధులు కోరారు. సర్వాయిపేట, నాగంపేట రోడ్డు మరమ్మతులు చేయించి కంకరతో రోడ్డు కల్వర్టు నిర్మించాలన్నారు. నక్కలపల్లి వెళ్లే దారిలో అటవీ అనుమతులు లేక రోడ్డు నిర్మాణం నిలిచిపోగా ఇటీవల అనుమతులు వచ్చాయని వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో జెడ్పీ చైర్‌పర్సన్, ఎంపీపీ, ఎంపీటీసీలను ఎంపీడీవో ఆకుల భూమన్న ఆధ్వర్యంలో అధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు అజ్గర్, ఎంపీవో సత్యనారాయణ, సూపరింటెండెంట్ లక్ష్మయ్య, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చేనేత, పవర్‌లూమ్ రంగాలకు నిధులు కేటాయించాలి


దివ్యాంగుడికి పెన్షన్ అందిస్తున్న జగన్నాథం

బెల్లంపల్లి: చేనేత, పవర్‌లూమ్ రంగాలను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందించాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం అన్నారు. ఆదివారం పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో పద్మశాలీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పద్మశాలీ పురస్కారాలు, దివ్యాంగులకు పెన్షన్ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చేనేత, పవర్‌లూమ్ రంగాలను పటిష్టం చేయడానికి కేంద్రప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేయాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న పలువురు పద్మశాలీ కులస్తులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలీ సేవా ట్రస్ట్ వ్యవస్థాపకుడు సిలివేరి నర్సింగం, ప్రభాకర్, కోశాధికారి భావనరుషి, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, జి.చంద్రశేఖర్, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, రాము, సతీశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మురుగునీటి సమస్య పరిష్కరించాలి

భీమారం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డుడ్యామ్‌పై నిలుస్తున్న మురుగు నీటి సమస్య పరిష్కరించాలని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ కోరారు. ఆదివారం రోడ్‌డ్యామ్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఇళ్ల నుంచి వచ్చే మురుగునీటితో పాటు వర్షం నీళ్లు కూడా పెద్ద ఎత్తున నిల్వ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కాసిపేట: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిద్ధం తిరుపతి తండ్రి లచ్చయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పరామర్శించారు.

ఏడాదిగా సాగుతున్న పనులు

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లి నుంచి కంచరబాయి గిరిజన గ్రామం వరకు రూ.కోటికి పైగా నిధులతో బీటీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించి ఏడాది దాటినా ఇంకా రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. కంకర పోసి వదిలేశారు తప్పా బీటీ వేయడం లేదు. దీంతో కంచరబాయి గిరిజనులతో పాటు, మామిడిపల్లి, కొత్తమామిడిపల్లి గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

తాండూర్: తాండూర్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ ఇన్‌స్టాలేషన్ అధికారి లెక్కల నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా బొమ్మ బాపు రెడ్డి, కార్యదర్శిగా ఠాకూర్ ఉమ్రావ్ సింగ్, కోశాధికారిగా మద్దికుంట రాంచందర్‌లను ఎన్నుకున్నారు. మహేందర్ రావు, సంగీతరావు, శంకర్, శ్రీనివాస్, వెంకటేశం, రాజయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో..

మంచిర్యాలటౌన్: లయన్స్‌క్లబ్ మంచిర్యాల నూతన కార్యవర్గం ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు, ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ డాక్టర్ ఆర్. విజయ, ప్రోగ్రాం చైర్మన్ వి.మధుసూదన్‌రెడ్డిలు హాజరై ప్రమాణస్వీకారం చేయించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా పి. బాల్‌మోహన్, కార్యదర్శిగా కె. చంద్రమౌళి, కోశాధికారిగా వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. బి. రాజమౌళి, ఎడ్ల శ్రీనివాస్, వాలేటి శ్రీనివాస్, ఇరుకుల్ల ఆనంద్, చంద్రమోహన్ గౌడ్, వి. వినయ్ కుమార్, కె. సుగుణాకర్ రెడ్డి, కొత్త సురేందర్, ఏ. రాజేశ్వరరావు, ఎస్. సూర్యనారాయణ, డేగబాబు, గోలిరాము, సత్తిరెడ్డి, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

'రైతుభరోసా'పై అవగాహన


మాట్లాడుతున్న డీఏవో సురేఖ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని రైతు వేదికలో ఆదివారం రైతు భరోసాపై జిల్లా వ్యవసాయాధికారి సురేఖ రైతులకు అవగాహన కల్పించారు. రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. డీఏవో మాట్లాడుతూ రైతుభరోసాలో అర్హులైన రైతులు ఎవరో ఏ విధంగా వారిని గుర్తిస్తారో తెలిపారున. అసిస్టెంట్ రిజిస్టార్ శృతి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి పాల్గొన్నారు.

కోటపల్లి: రైతుభరోసా పథకంపై సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు కోటపల్లి రైతువేదికలో సహకార సంఘం ఆధ్వర్యంలో డెప్యూటీ రిజిస్టర్ ఆడిటర్ రాథోడ్ బిక్కు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. రైతు భరోసా పథకం ముఖ్య ఉద్దేశం, పథకంలో కల్పించాల్సిన ప్రాధాన్యతలపై వివరిస్తూ సలహాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, సీఈవో రాజునాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్: పట్టణంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్ ఆధ్వర్యంలో వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జీల సమావేశం నిర్వహించారు. వైస్‌చైర్మన్ సల్ల మహేశ్, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, డీసీసీ అధికార ప్రతినిధి రాజేశం, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీ యువకులు రోడ్డుపై మట్టి పోసి శ్రమదానం చేశారు. హైవే రోడ్డు నుంచి కాలనీకి వెళ్లే రోడ్డు బురదమయంగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో యువకులు ట్రాక్టర్‌తో మొరం తెప్పించి, రోడ్డును చదును చేయించారు.

ఆనంద నిలయానికి చేయూత

మంచిర్యాలటౌన్: పట్టణంలోని శ్రీనగర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయంలోని అనాథ పిల్లలకు చెన్నూరుకు చెందిన పిల్లమర్రి దర్శన్ జ్ఞాపకార్థం తల్లిదండ్రులు కీర్తన –అజయ్‌లు రూ.13 వేల విలువలగల యూనిఫామ్‌లు అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రెటరీ చందూరు మహేందర్, ఆశ్రమం ఇంచార్జి సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్, శివకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మార్నింగ్ వాక్


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కరమే లక్ష్యంగా ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పట్టణంలోని పలు వీధుల్లో మార్నింగ్ వాక్ చేశారు. అంబేడ్కర్, పెద్దగూడెం, కొటబొగుడ వాడల్లో తిరుగుతూ ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంబేడ్కర్ కాలనీలో ప్రధానంగా డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని వర్షం పడితే నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు వివరించారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని మహిళలు మొరపెట్టుకున్నారు. అంబేడ్కర్ కాలనీలో డ్రెయినేజీ సమస్య పరిష్కారం కోసం వెంటనే పనులు ప్రారంభించాలని మున్సిపల్ ఏఈని ఎమ్మెల్యే ఆదేశించారు. పెద్దవాడలో డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షాకాలం ఇళ్లలో నీరు చేరుతుందని కాలనీవాసులు తెలిపారు. కొత్త డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ ఏఈ సాయికిరణ్, కాంగ్రెస్ నాయకులు హిమవంతరెడ్డి, సుశీల్‌కుమార్, ఖలీల్, చల్లా రాంరెడ్డిలు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలి

చెన్నూర్: పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలు సల్లంగా ఉండాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం ముదిరాజ్‌ల ఆరాధ్యదైవం పెద్దమ్మ తల్లి బోనాల జాతర నిర్వహించారు. ఎమ్మెల్యే ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకులు, ఆలయ నిర్వాహకులు మల్లయ్య, శ్రీనివాస్, నాగరాజు, రవీందర్, తుమ్మ శ్రీనివాస్, మధుకర్, మల్లక్క, సంతోశ్‌లు పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పెద్దమ్మ తల్లి పూజల్లో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. పెద్దమ్మ ఆలయం కోసం నిధులు మంజూరు చేయాలని ముదిరాజ్‌లు వినతిపత్రం అందించారు. నాయకులు రవి, సత్యనారాయణ రెడ్డి, రాజ్‌కుమార్ నాయక్, సత్తిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన డీసీపీ


భీమారం: ఎస్సైని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీసీపీ భాస్కర్

భీమారం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమేరకు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను ఎస్సై రాములును అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ఉండాలని సూచించారు.అనంతరం రికార్డులు పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీసీపీ మొక్కలు నాటారు. ఆయన వెంట జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎస్సై రాములు పాల్గొన్నారు.

జైపూర్‌లో..

జైపూర్: జైపూర్ సబ్‌డివిజన్ పరిధిలోని జైపూర్ పోలీస్‌స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి సందర్శించారు. పోలీస్‌స్టేషన్ చేరుకున్న డీసీపీ ముందుగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను సందర్శించి పరిశీలించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలు, పోలీస్‌స్టేషన్ భౌగోళిక పరిస్థితులు, పరిధిలోని గ్రామాలు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గంజాయి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు


లంబడిపల్లిలో బోనాలతో మహిళలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆషాఢమాసం ఆరంభంలోనే బోనాల సందడి నెలకొంది. హాజీపూర్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో పోచమ్మ తల్లి బోనాల జాతర ఆదివారం నిర్వహించారు. మహిళలు బోనమెత్తుకొని, మేళతాళాలు, డప్పుచప్పుళ్ల నడుమ, ఊరేగింపుగా, నృత్యాలు చేసుకుంటూ ఆలయాలకు చేరుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. చీర, సారె, గాజులు సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. వానలు సకాలంలో కురవాలని, పాడిపంటలు సంవృద్ధిగా పండాలని పోచమ్మ తల్లిని వేడుకున్నారు.

లంబడిపల్లిలో పోచమ్మకు మొక్కులు

చెన్నూర్‌రూరల్: వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని ప్రజలు సంతోషాలతో ఉండాలని కోరుతూ మండలంలోని లంబడిపల్లి గ్రామంలో ఆదివారం గ్రామస్తులు ఊరి పోచమ్మకు మొక్కులు చెల్లించారు. బోనాలతో అమ్మవారి గుడికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. అనంతరం కోళ్లను, మేకలను బలి ఇచ్చారు.

అ'పూర్వ' సమ్మేళనాలు


రామకృష్ణాపూర్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


లక్సెట్టిపేటలో..


జైపూర్‌లో..

జిల్లాలోని పలు పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించారు. లక్సెట్టిపేట రవీంద్ర భారతి హైస్కూల్‌లో 2007-2008 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, మందమర్రి పట్టణంలోని కార్మెల్ హైస్కూల్‌లో 1993 -94లో పదో తరగతి చదివిన విద్యార్థులు, రామకృష్ణాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2000-01 బ్యాచ్ విద్యార్థులు, జైపూర్ మండలంలోని ఇందారం శ్రీనివాస హైస్కూల్‌లో 1998 -1999 పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అపూర్వ సమ్మేళనాలు నిర్వహించారు.

– లక్సెట్టిపేట/మందమర్రిరూరల్/ రామకృష్ణాపూర్/ జైపూర్


మందమర్రిరూరల్: కార్మెల్ హైస్కూల్‌లో..

క్లుప్తంగా

దండేపల్లిలో కార్డన్ సెర్చ్

దండేపల్లి: మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం కాలనీలో ఆదివారం ఎస్సై భూమేష్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు ఇళ్లలో సోదాలు నిర్వహించారు. వాహనాల ధ్రువపత్రాలు తనిఖీ చేశారు. అనంతరం కాలనీలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దుకాణాల్లో నిషేధిత వస్తువులు విక్రయించకూడదని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చట్ట వ్యతిరేక పనులు చేస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో వలస కూలీల నివాస ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశానుసారం కంపెనీలో పని చేసే కూలీల నివాస ప్రాంతంలో ఎనిమిది సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, పోలీసులు పాల్గొన్నారు.

'ప్రిన్సిపాల్ సేవలు మరువలేనివి'


ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కాసిపేట: కాసిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రవీందర్ సేవలు మరువలేనివని మంచిర్యాల డీఐఈఓ శైలజ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదవీ విరమణ పొందిన రవీందర్‌కు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతీ వ్యక్తికి ఉద్యోగ విరమణ తప్పదని ఉద్యోగంలో తన పదవీలో చేపట్టిన జ్ఞాపకాలు, సేవా కార్యక్రమాలు జీవితాంతం గుర్తుండాలన్నారు. కుమురంభీం డీఐఈవో శంకర్, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

డాక్టర్ శరత్‌బాబుకు సన్మానం


శరత్‌బాబును సన్మానిస్తున్న విజయవాడ వాకర్ అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు చెందిన డాక్టర్ శరత్‌బాబును డాక్టర్స్ డే పురస్కరించుకొని ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో విజయవాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శతమానంభవతి వారు ఘనంగా సన్మానించారు. డాక్టర్‌గా శరత్‌బాబు అందించిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్, ఎంపీ రావు పాల్గొన్నారు.

చిన్ననాటి మిత్రుడి కుటుంబానికి చేయూత

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో 1998 -99 బ్యాచ్‌కు చెందిన చిన్ననాటి మిత్రులు ఆపదలో ఉన్న స్నేహితుడి కుటుంబానికి చేయూత అందించారు. హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన బోయిన రాజ్‌కుమార్ అకాల మరణంతో, మంచిర్యాలకు చెందిన బాల్య మిత్రులు రూ. 30 వేలను సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బాల్య మిత్రులు పూదరి ప్రభాకర్, పాత నరేశ్, పురెల్ల రాజన్న, మద్దెర్ల ప్రశాంత్, గంగాధరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భైరవస్వామికి పూజలు

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి గ్రామంలో కొలువైన భైరవస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు.

పరస్పరం దాడులు

బెల్లంపల్లి: పట్టణంలో ఆదివారం రాత్రి పరస్పరం దాడులు చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని కాంటాచౌరస్తా వద్ద శివప్రసాద్ అనే వ్యక్తి మహేశ్, కార్తీక్ మరికొందరు యువకులు గొడవపడ్డారు. అనంతరం పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడుల్లో శివప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య, ఎస్సై రమేశ్ సిబ్బందితో అక్కడకు చేరుకొని గొడవ పడ్డ వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా శివప్రసాద్ ఓ పత్రికలో విలేకరిగా పని చేస్తున్నాడు. పాతకక్షలతోనే దాడులు చేసుకున్నట్లుగా తెలుస్తోంది.